# క్రీడావాణి

## సియోల్ ఒలింపిక్స్‌కి రాజకీయ గ్రహణం?

1988 సెప్టెంబర్ 17 నుంచి సియోల్ ఒలింపిక్స్ క్రీడోత్సవాలకు ఒకవైపున ముమ్మరంగా సన్నాహాలు జరుగుతుండగా మరొక వైపు ఈ క్రీడలు జరుగుతాయా? అన్న సందేహాన్ని ఆ దేశంలోని పలు రాజకీయ పక్ష నాయకులతో పాటు, పోటీలలో పాల్గొనే అమెరికా ఒలింపిక్స్ కమిటీ కూడా వ్యక్తం చేస్తున్నది.

ముఖ్యంగా దక్షిణ కొరియాలో రాజకీయ, ఆర్థిక సంక్షోభం ఏర్పడడంతో ఇంకా 15 నెలల వ్యవధి వున్న సియోల్ 'ఒలింపిక్స్'పై అనుమానాలు వ్యక్తం చేయడం కొంతవరకు ఆశ్చర్యం కల్గించినా, ఈ తరుణంలో క్రీడాకారులకు, ప్రతినిధులకు రక్షణ కల్పించడం అసాధ్యం అని అమెరికా వ్యాఖ్యానించింది. అందుకే ఈ క్రీడల తేదీకి మూడు నెలల ముందు "తాము పాల్గొనేది లేనిది ప్రకటిస్తాం" అని అమెరికా ఒలింపిక్స్ కమిటి (ఎ.ఒ.సి.) తెల్పింది.

దక్షిణ కొరియాలో నెలకొని వున్న రాజకీయ సంక్షోభం, దాని తీరుతెన్నులు పరిశీలిస్తూ వున్న అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటి (ఐ.ఒ.సి.) 1988 ఒలింపిక్స్‌పై సరైన నిర్ణయం వ్యక్తం చేయలేని స్థితిలో వుంది. కాని దీనికి విరుద్ధంగా "ఒలింపిక్స్‌ను మేం నిర్వహిస్తాం" అని చూచాయగా లాస్ ఏంజిల్స్ నగర మేయర్ ఐ.ఒ.సి.కి తెల్పినట్టు తెలుస్తున్నది. ఈ చర్య దక్షిణ కొరియాను మరింత ఇరకాటంలో పెట్టేదిగా వుందనిపిస్తుంది కూడా.

ఒక ప్రక్క ఒలింపిక్స్‌ను ఎక్కడ నిర్వహించాలి అన్న సందేహాలను వ్యక్తం చేస్తూనే, ఐ.ఒ.సి. తదితర కమిటీలు "ఇంకా చాలా సమయం వుంది. అప్పుడే నిర్ణయం తీసుకోవడం భావ్యం కాదం"టున్నాయి. "క్రీడాకారులకు రక్షణ కరువయ్యే సూచనలు కనిపిస్తే మేం బహిష్కరిస్తాం" అని కూడా ఎ.ఒ.సి. విస్పష్టంగా ప్రకటించింది. ఇప్పటికే ఉత్తర కొరియా క్రీడలను బహిష్కరించింది.

ఈ విధంగా ఒలింపిక్స్ కమిటీలు తర్జన భర్జనలు పడుతూంటే ఇటీవల యూరోపియన్ ఒలింపిక్ కమిటి (యు.ఒ.సి.) సమావేశమై సియోల్‌లో ఒలింపిక్స్ నిర్వహణకి కావలసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి క్రీడలను నిర్వహిస్తాం అని ప్రకటించడం ఆనందాన్ని కల్గించింది అంతేకాక దక్షిణ కొరియాలో నెలకొన్న పరిస్థితి ఈ క్రీడలు నిర్వహించడానికి ఆటంకం కాదని, అందుచేత ఈ క్రీడల కేంద్రాన్ని మార్చే ప్రసక్తి లేదని కూడా కమిటీ స్పష్టం చేసింది.

1988లో జరిగే ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకునే దక్షిణ కొరియా 1986లో ఆసియా క్రీడోత్సవాలను నిర్వహించింది. ఇంకా వసతి గృహాలు, స్విమ్మింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ముమ్మరంగా సాగుతున్నది. ఒలింపిక్స్‌ను నిర్వహించి జపాన్ ప్రపంచంలో ఒక సుసంపన్న దేశంగా రూపు దిద్దుకోవడంతో తాము అదే కోవలో పయనించి తాము కూడా ఒలింపిక్స్‌ను నిర్వహించగలం అనిపించుకోవడం కోసం కొరియా అధికారులు తహ తహలాడుతున్నారు.

1972 మ్యూనిచ్ ఒలింపిక్స్ క్రీడోత్సవాల కంటే అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనే విధంగా చేసి ఒక రికార్డు సృష్టించాలని కూడా ఒలింపిక్స్ కమిటీ ఆశిస్తున్నది. ఈ ఒలింపిక్స్‌లో దాదాపు 167 దేశాలు పాల్గొంటాయని, 13 వేల మందికి పైగా అధికారులు గాని, క్రీడాకారులు గాని పాల్గొంటారని అంచనా. ఇదీ ఒక రికార్డే కావచ్చు. ఈ క్రీడలలో పాల్గొనేవారికి వసతికి ఇప్పటికే దాదాపుగా ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి.

ఇంకా 15 నెలల వ్యవధి వున్నప్పటికీ సియోల్‌కి అప్పుడే ఒలింపిక్స్ కళ వచ్చింది. అన్ని రకాలుగా నిర్మాణంలో వున్న క్రీడా ప్రదేశాలు, భవనాలు ఒలింపిక్స్ చిహ్నమైన 'పులి పిల్ల' బొమ్మలు కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి.

ఈ రకంగా సియోల్ అధికారులు ఏర్పాట్లలో తలమునకలై వుంటే రాజకీయ సంక్షోభం ప్రస్తుతం తలెత్తడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. కాని 1968లో కూడా మెక్సికో ఒలింపిక్స్‌కి కొద్ది రోజులు ముందే అక్కడ తీవ్రమైన అలజడి, అల్లర్లు చెలరేగాయి. కాని ఒలింపిక్స్ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా అవి ముగిసాయి. అదే విధంగా దక్షిణ కొరియాలో కూడా ప్రస్తుతం వున్న పరిస్థితి సమసిపోతుందని ఆశిద్దాం.

క్రీడాకారులకు, అధికారులకు తగిన భద్రత కల్పిస్తే ఈ క్రీడలు ప్రశాంతంగా జరగడానికి అవకాశాలు వున్నాయి కదా. అంతే కాని ఈ దేశాన్ని కించపరిచే విధంగా, బలహీన పరిచే రీతిలో సియోల్ నుంచి మార్చడం సబబు కాదు. యు.ఒ.సి. అన్నట్టు ఒలింపిక్స్ జరిగే నాటికి దక్షిణ కొరియాలో రాజకీయ సంక్షోభం పూర్తిగా సమసిపోతుందని, ఒలింపిక్స్ నిరాటంకంగా జరుగుతాయని ఆశిద్దాం!

- అనుముకొండ నాగేంద్రప్రసాద్

కాలమ్‌దాటని కథ

## "అదీసంగతి"



అతను నన్ను చూసి మళ్ళీ నవ్వాడు.

నేనూ నవ్వాను. కానీ, నిజానికి అతనెవరో కూడా నాకు తెలీదు.

తిరిగి నవ్వాడతను. నేను మొఖం వేరే వైపుకు తిప్పుకున్నాను.

అంతే, వెంటనే అతను నా దగ్గర కొచ్చేశాడు.

"నమస్కారంరా... ఇంతకీ చంకలో ఏవో పేపర్లు పట్టుకున్నావ్? ఎక్కడికోయ్" అతని ఆ సంబోధనకు అదిరిపడ్డాను.

"ఇంటర్వ్యూకి వెళ్తున్నా" -చెప్పాను.

"ఎక్కడ?"

"ప్రేమ్ అండ్ ప్రేమ్ కంపెనీ"

"ఆర్నీ, ఆ మేనేజర్ నా బావ మరిదేనోయ్"

అదిరిపడి, వెంటనే అతని చేతులు పట్టుకొని, 'సార్. ఈ ఉద్యోగం నా కెలాగైనా వచ్చేలా మీరు రికమెండ్ చేయాలి సార్" చెప్పాను నేను.

"దాని కేముందిలేవోయ్ పద... ఇంటర్వ్యూ ఎన్ని గంటలకి?"

"పది గంటలకి సార్"

"ఇప్పుడు టైమెంత?" అడిగాడతను.

"తొమ్మిది సార్"

'సరే పద' అంటూ నడవసాగాడు. అతన్ని అనుసరించాను నేను ఆనందంగా.

"ఇప్పుడే వస్తాను. నువ్విక్కడే వుండవోయ్' అంటూ అతను ఆ ఆసుపత్రిలోకి పరిగెత్తాడు.

నేను బయట కాసేపు నిలుచున్నాను... అతను రాలేదు.

నాకా ఇంటర్వ్యూకి టైమవుతోంది?

తిరిగి కాసేపు వేచి చూశాను... అతను రానేలేదు.

ఎందుకో అనుమానమొచ్చి అది ఏం ఆసుపత్రో బోర్డు చూసి అదిరి పడ్డాను. 'అది పిచ్చాసుపత్రి.'

అప్పటికే ఆలశ్యమయ్యేసరికి, నేను పిచ్చి పట్టినోడిలా 'ఇంటర్వ్యూ' కోసం పరుగు లంకించాను.

—కందమూరి జనార్థన్